క్లుప్తంగా

ఏజీపీగా కందుల


కందుల నరేష్ కుమార్

పెద్దాపురం: స్థానిక ఏడో అదనపు జిల్లా కోర్టు ఏజీపీగా పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది కందుల నరేష్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఆయనను ఏజీపీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. స్థానిక ప్రజలకు అందుబాటులో న్యాయ సేవలందిస్తున్న ఏజీపీ కుమార్ నియమాకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, ప్రజాప్రతినిధులు ఆయనను ప్రత్యేకంగా అభినందించారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో పంచారామంలోని భీమేశ్వర స్వామి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భాద్రపద మాసం పంచమిని పురస్కరించుకుని ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు స్వామి వారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు.

మొక్కలతో కాలుష్య నివారణ


మొక్కలు నాటిన అధికారులు

సామర్లకోట: ప్రతి ఒక్కరు రెండు మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా కాలుష్య నివారణకు సహకరించాలని రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీరు (వర్క్స్) రవికాంత్ అన్నారు. స్వచ్ఛ పఖ్వాడాలో భాగంగా మంగళవారం సాయంత్రం రైల్వే స్టేషన్ ఆవరణలో మొక్కలు నాట్టారు. ఈ మేరకు రైల్వే స్టేషన్‌కు వచ్చిన ప్రయాణికులకు స్వచ్ఛ పఖ్వాడాపై అవగాహన కల్పించారు. పరిసరాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఇన్‌స్పెక్టరు కల్యాణి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టరు కేవీ గిరి, ఎస్ఎస్ శ్రీధర్, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

వేగవంతమైన సేవలు అందించాలి


మహిళా పోలీసులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీహరి రాజు

మహిళా పోలీసులకు డీఎస్పీ హితవు

సామర్లకోట: ఆయా గ్రామాల్లో ఉన్న సచివాలయ మహిళా పోలీసుల సేవలు వేగవంతం చేయాలని డీఎస్పీ డి.శ్రీహరిరాజు అన్నారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో మహిళా పోలీసులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రస్తుత పండగ దసరా, దీపావళి పర్వదినాల్లో తాళాలు వేసి ఊళ్లకు వెళ్లే అవకాశం ఉంటుందన్నారు. అటువంటి వారిని గుర్తించి ఎల్‌హెచ్‌ఎంఎస్ సౌకర్యాన్ని ఉపయోగించుకునే విధంగా చూడాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలు జూదాలు వంటివి జరిగితే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామాల్లో ఏదైనా చిన్న సమస్యలు తలెత్తినా వెంటనే పోలీసు అధికారులకు తెలియపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎ.కృష్ణభగవాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల నిరసన


పెద్దాపురం ఎల్ఐసీ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న ఏజెంట్లు

పెద్దాపురం: పాలసీల కమీషన్లలో కోత విధించడంపై ఎల్ఐసీ ఏజెంట్లు స్థానిక కార్యాలయం వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పెద్దాపురం ఎల్ఐసీ ఏజెంట్ల సంఘం అధ్యక్షుడు అప్పాన నాగేశ్వరరావు, సెక్రటరీ గొండేల జగదీశ్వరరావు, సహాయ కార్యదర్శి వాసంశెట్టి గంగ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ఖాతాదారులకు ప్రీమియం రెండు లక్షలు పెంచడం వల్ల సన్న, చిన్నకారు రైతులు ప్రీమియం తట్టుకునే అవకాశం లేదన్నారు. అటువంటి సమయంలో ప్రీమియం రేట్లు తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. వీటిపై ఏజెంట్ల కమిషన్ కోత మరింత దారుణమని సత్వరమే వాటి నిర్ణయాలను విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో గౌరీపతిరావు, గోరింట అబ్బులు, పడాల దుర్గాప్రసాద్, కుసుమంచి కృష్ణంరాజు, బోయిన వెంకటరమణ, పీవీఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

శుభ్రత నిల్.. వ్యాధులు ఫుల్

- వాటర్ ట్యాంకుల నుంచి కలుషిత నీరు సరఫరా
- రోగాల బారిన పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు


కట్టమూరులో క్లీనింగ్ చేపట్టని మంచినీటి ట్యాంక్


పంచాయతీల్లో వాటర్ ట్యాప్‌లో వస్తున్న బురద నీరు


బురద నీటిలో వస్తున్న పురుగులు

పెద్దాపురం: ప్రజలకు రక్షిత తాగునీరు అందించే లక్ష్యంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన మంచినీటి పథకాలు కూటమి ప్రభుత్వంలో గాడి తప్పుతున్నాయి. గ్రామాల్లో ప్రజలకు ఆరోగ్యకరమైన తాగునీటిని అందించాల్సింది పోయి అపరిశుభ్ర నీటిని సరఫరా చేస్తున్నారు. పెద్దాపురం మండలంలోని మేజర్ పంచాయతీ కట్టమూరులో వాటర్ ట్యాంకులను నిర్లక్ష్యంగా వదిలేస్తుండడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

23 గ్రామాల్లో..

మండల పరిధిలో 23 గ్రామాలకు గాను 40 వరకు ఓవర్ హెడ్ ట్యాంకులు, 39 జీఎల్ఆర్ ట్యాంకులు, 176 చేతి పంపులున్నాయి. వీటి ద్వారా ప్రజలకు తాగునీటిని సరఫరా చేయాల్సి ఉండగా పూర్తిస్థాయిలో ప్రజలకు తాగునీరు అందడం లేదు. మంచినీటి పథకం ప్రారంభించే సమయంలో ఫొటోలకు పోజులిచ్చే కూటమి నేతలు సురక్షిత మంచినీటి సరఫరాపై చిత్తశుద్ధి కనపర్చకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా ట్యాంకుల వద్ద క్లోరినేషన్ సైతం పంచాయతీ కార్యదర్శులు మొక్కుబడిగానే చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దీంతో కట్టమూరుతో సహా ఆయా గ్రామాల్లో ప్రజలు కలుషిత నీటితో తీవ్ర అనారోగ్యాల పాలవుతున్నారు.

నిబంధనలు ఇలా..

రక్షిత మంచినీటి ట్యాంకులు ప్రతి నెలా 15 నుంచి 30 రోజుల్లోగా శుభ్రం చేయాల్సి ఉంది. సంబంధిత పంచాయతీ కార్యదర్శి లాక్‌బుక్ ఒక్కటి పెట్టుకోవాలి. ట్యాంకు శుభ్రం చేసిన తేదీని, మళ్లీ శుభ్రం చెయ్యాల్సిన తేదీని ట్యాంక్‌పై విధిగా రాయించాలి. ట్యాంక్ ఆ నెలలో శుభ్రం చేసినట్లు అంగన్‌వాడీ వర్కరు, ఏఎన్ఎం, పంచాయతీ కార్యదర్శి విధిగా సంతకాలు చెయ్యాలి. కాగా మంచినీటి ట్యాంకులు శుభ్రం చెయ్యడానికి వచ్చిన నిధులు పంచాయతీ సిబ్బంది, పాలకులు పక్కదారి పట్టిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

క్లోరినేషన్ ఊసేలేదు

కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు కావస్తోంది. ఆయా గ్రామాల్లో సురక్షిత మంచినీటి సరఫరా చేయాల్సిన అధికార యంత్రాంగం మొద్దు నిద్ర వహిస్తుండడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. ప్రతి పంచాయతీ పరిధిలో 20 రోజులకోసారి వాటర్ ట్యాంకులను శుభ్రం చేయాల్సి ఉండగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఇప్పటికీ ఒక్కసారి కూడా ఆయా గ్రామాల్లో ఓటర్ ట్యాంక్‌లు క్లోరినేషన్ చేసిన దాఖలాల్లేవు.

కలుషిత నీటితో రోగాలు



మా గ్రామంలో పంచాయతీ కుళాయిల నుంచి కలుషిత నీరు సరఫరా అవుతోంది. దీనిపై పలుమార్లు ఫిర్యాదులు చేసిన ట్యాంక్‌లను శుభ్రం చేసిన దాఖలాల్లేవు. అధికారులు దృష్టి సారించి పరిశుభ్రమైన మంచినీటి సరఫరాకు చర్యలు చేపట్టాలి.

–ఎం.భానుసురేష్, స్థానికుడు, కట్టమూరు

ట్యాంకులను శుభ్రం చేయిస్తాం



పెద్దాపురం ఎంపీడీఓగా ఇటీవల బాధ్యతలు స్వీకరించా. తప్పకుండా మంచినీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారిస్తాను. నిర్ణీత గడువులోగానే ప్రతి గ్రామంలో ట్యాంకులను శుభ్రం చేయించి ప్రజలకు మెరుగైన మంచినీటి సరఫరాకు చర్యలు తీసకుంటాం.

–డి.శ్రీలలిత, ఎంపీడీఓ, పెద్దాపురం

సమాచార హక్కు చట్టం బోర్డు సరిచేశారు



పేర్లు మార్చి ఏర్పాటు చేసిన సమాచార హక్కు చట్టం బోర్డు

సాక్షి ఎఫెక్ట్

సామర్లకోట: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ముఖద్వారం వద్ద ఉన్న సమాచార హక్కు చట్టం బోర్డును సరి చేశారు. 'నిర్లక్ష్యానికి నిదర్శనం' అనే శీర్షికతో మంగళవారం ప్రచురితమైన కథనానికి ఎంపీడీఓ స్పందించారు. వెంటనే బోర్డులో పేర్లు మార్చాలని ఆదేశాలు జారీ చేశారు. సమాచార హక్కు చట్టం బోర్డులో బదిలీ అయిన అధికారుల పేర్లు ఉండటంతో ఆ విషయాన్ని సాక్షి దినపత్రికలో ప్రచురితమైంది. దాంతో అధికారులు స్పందించారు. సుమారు రెండు నెలల క్రితం బదిలీ అయిన ఎంపీడీఓ ఎస్‌డీ శ్యామ్‌సుందర్, సీనియర్ అసిస్టెంట్, పరిపాలనాధికారి పేర్లు ఉన్నాయి. తాత్కలికంగా పేపరుపై పేర్లు టైపు చేసి పాత అధికారుల స్థానంలో అతికించారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేసిన పారిశుధ్య కార్మిక సంఘు నాయకులు

సామర్లకోట: స్థానిక మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. కార్మిక సంఘం నాయకుల ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనకు ఏఐటీయూసీ మద్దతు తెలియజేసింది. యూనియన్ జిల్లా కార్యదర్శి మధు మాట్లాడుతూ పెరిగిన జనాభాకు అనుగుణంగా పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచకపోవడం దారణమన్నారు. కార్మికులను పారిశుధ్య ట్రాక్టర్లపై డ్రైవర్లుగా నియమించడం వలన వారికి లైసెన్సులు లేకపోవడం, ప్రమదాలు జరిగిన సమయంలో కేసులలో ఇరుక్కుని జైలుకు వెళ్లాల్సి వస్తోందన్నారు. గతంలోలా మస్తరు విధానం అమలు చేయాలని, బకాయి హెల్త్ అలవెన్సు వెంటనే ఇవ్వాలని, డ్రైవరు పోస్టులను బర్తీ చేయాలని, రిటైరు అయిన తదితర డిమాండ్లు చేశారు. సమస్యలు పరిష్కరించక పోతే మున్సిపల్ కార్యాలయం ఎదుట వంటా వార్పుతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. మున్సిపల్ జనాభా ప్రకారం అదనంగా మరో 40 మంది కార్మికులను నియమించాల్సి ఉందన్నారు. కార్మిక సంఘు అధ్యక్షుడు బొచ్చా శ్రీను అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోక ప్రసాద్, పెదిరెడ్ల సత్యనారాయణ, కామిరెడ్డి బోడకొండ, సంఘ కార్యదర్శి కె.కిశోర్, ఉపాధ్యక్షు రాలు మల్లిపూడి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. పారిశుధ్య కార్మికుల డిమాండ్లపై మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్యకు వినతి పత్రం అందజేశారు.

తాళం వేసిన ఇంటిలో చోరీ

లాకర్‌లోని రూ.10 వేలు మాయం


సీసీ కెమెరాల పుటేజీని పరిశీలిస్తున్న క్రైమ్ సీఐ అంకబాబు

సామర్లకోట: స్థానిక సత్యనారాయణపురంలో చోరీ జరిగి రెండు రోజులు గడవక ముందే సిరిపల్లి వారి వీధిలో మంగళవారం తెల్లవారు జామున మరో చోరీ జరిగింది. నేతి జానకి వెంకటరామన్ సరిపల్లి వారి వీధిలో మొదటి అంతస్తులో ఉంటున్నాడు. అతని సమీప బంధువులు చనిపోవడంతో తలుపు తాళం వేసి కాకినాడ వెళ్లారు. దీనిని గమనించిన ఒక వ్యక్తి మెట్లు మీదుగా మొదటి అంతస్తులోనికి ప్రవేశించి తలుపు తాళాలు పగలగొట్టి అందుబాటులో ఉన్న సుమారు రూ.10 వేల నగదు చోరీ చేశారు. గ్రౌండ్ ఫ్లోరులో అన్నయ్య నేతి చంద్రశేఖర్ కుటుంబ సభ్యులు ఉంటున్నారు. తల్లి బాత్‌రూమ్‌కు వెళ్లడానికి బయట లైటు వేయడంతో అలికిడికి దొంగ నెమ్మదిగా జారుకున్నాడని బాధితుడి అన్న చంద్రశేఖర్ తెలిపారు. చంద్రశేఖర్ తల్లి బాత్‌రూమ్‌కు వెళ్లడానికి ప్రయత్నం చేసే సమయంలో తెలుపు బయట గెడ పెట్టి ఉండటంతో విషయాన్ని కుమారుడు చంద్రశేఖర్‌కు చెప్పింది. దాంతో కిటికీలోకి చూడగా ఒక వ్యక్తి నెమ్మదిగా నడిచివెళ్తున్నట్టు చంద్రశేఖర్ చెప్పాడు. వెంటనే ఇంటి ఎదురుగా ఉన్న రైతు సంఘ నాయకుడు కంటే బాబుకు ఫోన్ చేసి విషయం చెప్పడంతో అతను వచ్చి తలుపు గెడ తీశాడు. మొదటి అంతస్తులోనికి వెళ్లి చూడగా తలుపులు, బీరువా తెరచి ఉండటంతో చోరీ జరిగినట్టు గమనించారు. బీరువాలో ఉన్న సుమారు రూ.10 వేలు నగదుతో దొంగ పరారైనట్టు గమనించారు. లాకరులోని విలువైన అభరణాలు అలాగే ఉండడంతో ఊపిరి పీల్చుకున్నారు. డీఎస్పీ శ్రీహరిరాజు ఘటనా ప్రదేశాన్ని పరిశీలించి చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు సీఐ ఎ.కృష్ణభగవాన్, క్రైమ్ సీఐ అంకబాబు, వేలి ముద్ర నిపుణులు సంఘటనా ప్రదేశాన్ని, సీసీ కెమెరాలను క్షుణంగా పరిశీలించారు. సీఐలు మాట్లాడుతూ చోరీలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. తాళాలు వేసి ఊరు వేళ్లే సమయంలో పోలీసులకు సమాచారం ఇస్తే సదరు ఇళ్లపై ప్రత్యేక నిఘా ఉంచుతామని వివరించారు. దీనిపై డీఎస్పీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

అభివృద్ధి బాటే ప్రధాన లక్ష్యం


మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిన రాజప్ప

పెద్దాపురం: మండల అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పాటుపడదామని ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప అన్నారు. పెద్దాపురం మండల పరిషత్ సర్వ సభ్య సాధారణ సమావేశం మంగళవారం ఎంపీపీ పెంకే సత్యవతి అధ్యక్షతన జరిగింది. ప్రజా ప్రతినిధులు తమ సమస్యలను అధికారుల ముందుంచాలని ఎమ్మెల్యే పలు సమస్యలపై సమావేశంలో చర్చించారు. గుడివాడ, చదలాడ గ్రామ సర్పంచ్‌లు కనపర్తి చీమదొర, ఒబిలిశెట్టి అబ్బాయి మాట్లాడుతూ పులిమేరు–గుడివాడ, చదలాడ–కాండ్రకోట రహదారి నిర్మాణాలపై దృష్టి సారించాలన్నారు. కాండ్రకోట సర్పంచ్ శ్రీనివాస్, జి.రాగంపేట సర్పంచ్ శేఖర్ మాట్లాడుతూ ఉపాధి హామీ నిధుల వ్యవహారంపై పంచాయతీల్లో జరిగే అభివృద్ధి పనులు సర్పంచ్‌ల ఆధ్వర్యంలోనే నిర్వహించాలన్నారు. ఎమ్మెల్యే చిన రాజప్ప మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులను మరింత మెరుగుపరచి ప్రజారోగ్యంపై మరింత శ్రద్ధ కనబరచాలన్నారు. అనంతరం పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మిరియాల రాజా, ఎంపీడీఓ శ్రీలలిత, తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఐసీడీఎస్ సీడీపీఓ ఉష, ఏపీఎం సూర్యనారాయణ, సర్పంచ్‌లు మొయిళ్ల కృష్ణమూర్తి, మాకిరెడ్డి శ్రీనివాస్, ఎంపీటీసీలు నల్లల సూర్యకుమారి, జాగు వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు, బాలికలకు రక్షణ కరవు

పిఠాపురం: రాష్ట్రంలో మహిళలు, బాలికలకు రక్షణ కరువైందని సీపీఎం నేతలు విమర్శించారు. పిఠాపురంలో అత్యాచారానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మైనర్ బాలికను మంగళవారం సీపీఎం నాయకులు పరామర్శించారు. బాధితురాలి కుటుంబ సభ్యుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ మైనర్ బాలికపై అత్యాచారం జరగడం దారుణమన్నారు. టీడీపీ పట్టణ మహిళా అధ్యక్షురాలు, మాజీ కౌన్సిలర్ భర్త డి.జాను సుబ్బలక్ష్మి అనే మరో మహిళతో కలిసి బాలికను ఆటోలో మాధవపురం డంపింగ్ యార్డ్ వద్దకు తీసుకువెళ్లి అత్యాచారానికి పాల్పడినట్లు కుటుంబ సభ్యుల తెలిపారన్నారు. అత్యాచారానికి పాల్పడిన, సహకరించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పరామర్శించిన వారిలో సీపీఎం నాయకులు కె.చిన్నా, కోనేటి రాజు, విశ్వనాథం, ఐద్వా నాయకులు ఓ.మణి, జేవీవీ నాయకులు సూర్యనారాయణ, మణికంత పాల్గొన్నారు

అభివృద్ధి పనులను పర్యవేక్షించాలి

- ఉప సర్పంచ్, వార్డు సభ్యుల శిక్షణలో ఎంపీపీ బొబ్బరాడ
- ముగిసిన రెండు రోజుల శిక్షణ


శిక్షణ పూర్తి చేసుకున్న ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు సర్టిఫికెట్లు అందజేసిన ఎంపీపీ, ఎంపీడీఓ

సామర్లకోట: ఆయా పంచాయతీల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల నాణ్యతను ఉప సర్పంచ్, వార్డు సభ్యులు పర్యవేక్షించాలని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు సూచించారు. పంచాయతీ రాజ్ వ్యవస్థపై మండల పరిధిలోని ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు నిర్వహిస్తున్న మంగళవారం ముగింపు శిక్షణలో ఆయన పాల్గొన్నారు. గ్రామాల్లో ప్రజల అవసరాలను గుర్తించి ఆ మేరకు అభివృద్ధి పనులు జరిగే సమయంలో పర్యవేక్షించడం వల్ల కాంట్రాక్టర్లు నాణ్యతతో చేస్తారని వివరించారు. పంచాయతీల్లో నిధులు లేని సమయంలో ఆ సమస్యను సర్పంచ్‌లు మండల పరిషత్తు సమావేశాల్లో చర్చించి మండల నిధులు తీసుకురావడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. ఈఓపీఆర్డీ భైరవమూర్తి మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో ప్రజా ప్రతినిధులు ప్రజలకు ఉత్తమ సేవలు అందించడం ద్వారా గుర్తింపు తెచ్చుకోవచ్చునని వివరించారు. రాజకీయాల్లో ఉన్నత పదవులకు స్థానిక సంస్థలు ఎంతగానో దోహదపడతాయన్నారు. రిసోర్సుపర్సన్లు వై.శ్రీహరి, సునీల్‌కుమార్ రెండో రోజు శిక్షణ నిర్వహించారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ హిమామహేశ్వరి పిలుపు నిచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఆమెతో పాటు, ఎంపీపీలు సర్టిఫికెట్లు అందజేశారు.

జగజ్జనని.. ఐశ్వర్య ప్రదాయిని


పాదగయ క్షేత్రంలో కాళికాదేవిగా దర్శనమిచ్చిన రాజరాజేశ్వరీదేవి


ప్రత్యేక అలంకరణలో పురుహూతికా అమ్మవారు


తాటిపర్తిలో కాత్యాయనిదేవి అలంకరణలో అపర్ణాదేవి


కొత్తపల్లి దుర్గాదేవి, సరస్వతీదేవి అవతారంలో అమ్మవారు

- కాళికా దేవిగా దర్శనమిచ్చిన రాజరాజేశ్వరి అమ్మవారు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు


తాటిపర్తి అపర్ణాదేవి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు


మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చిన పంచారామ క్షేత్రంలోని బాలాత్రిపుర సుందరి అమ్మవారు


మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చిన భువనేశ్వరి అమ్మవారు


కాండ్రకోటలో మహాలక్ష్మీ దేవిగా నూకాలమ్మతల్లి


పిఠాపురం మండలం రాపర్తిలో శాకంబరిగా దుర్గాదేవి


గొల్లప్రోలు మండలం దుర్గాడలో లలితాదేవి

పిఠాపురం: దసరా ఉత్సవాలు పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లో వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం పాదగయ క్షేత్రంలో వేంచేసిన రాజరాజేశ్వరీదేవి అమ్మవారు కాళికాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. క్షేత్రంలోని పూరూహూతికా అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పండితులు అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వెలసిన అపర్ణాదేవి అమ్మవారు నిమ్మకాయల అలంకరణలో కాత్యాయినీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. దుర్గాడ శివాలయంలోని లలితామాత ప్రత్యేక అంలకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

మహాలక్ష్మిదేవిగా అమ్మవార్ల దర్శనం

పెద్దాపురం: శరన్నవ రాత్ర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవార్లు మహాలక్ష్మిదేవిగా దర్శనమిచ్చారు. మండలంలోని కాండ్రకోట నూకాలమ్మ, పెద్దాపురం మరిడమ్మ తల్లి మంగళవారం మహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక వర్షుల వారి వీధిలోని శ్రీభువనేశ్వరి పీఠంలో భువనేశ్వరి అమ్మవారు మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. ఆయా అమ్మవార్లను దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

మహాలక్ష్మిగా బాలాత్రిపుర సుందరి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు మంగళవారం ఆరో రోజు మహాలక్ష్మీ స్వరూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో అర్చకులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లాకి రాజగోపాల్‌శర్మ, సన్నిధిరాజు వెంకటరమణ, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు సత్యనారాయణ మూర్తి, వినయ్ ఆధ్వర్యంలో దుర్గా సప్తశతి పారాయణ, కుంకుమార్చనలు నిర్వహించారు.